టీడీఆర్ బాండ్ స్థలాలపై విజిలెన్స్

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీలో గతంలో ఇచ్చిన టీడీఆర్ బాండ్ల స్థలాలను బుధవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. దాదాపు 15 స్థలాలను మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి వివరాలు సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ ద్వారా విచారణ చేపట్టింది. భీమవరం మునిసిపాల్టీల్లో టీడీపీఆర్ బాండ్లపై విచారణ చేపట్టిన విషయం పట్టణంలో సంచలనంగా మారింది.



మావుళ్లమ్మ మూల విరాట్ దర్శనం నిలిపివేత

వార్షిక మహోత్సవాలకు శ్రీకారం

పందిరి రాట నిలబెట్టిన సభ్యులు

6



శరవేగంగా డయాఫ్రం గైడ్‌బండ్ వాల్ నిర్మాణం

80 మీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తి

తవ్వకాలు జరిపేందుకు ట్రెంచ్ కట్టర్లు సిద్ధం

మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి టెన్త్ పరీక్షలు

7

టీడీపీ సభ్యత్వ నమోదు

రాష్ట్రంలోనే పాలకొల్లు ప్రథమం



టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఉత్తేజం ఏమాత్రం తగ్గకుండా సభ్యత్వ నమోదులో తీసుకున్న చర్యలతో క్షేత్రస్థాయిలో సానుకూలత ఫలితాలు కనిపిస్తున్నాయి. గతం కంటే భిన్నంగా ఈసారి నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదులో నాయకత్వం ఉత్సాహంగా ముందుకెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు నియోజకవర్గం రాష్ట్ర, జిల్లా స్థాయిలోనే తొలి స్థానంలో నిలవడం ద్వారా సత్తా చాటుకున్నారు. ఉండి నియోజకవర్గం రాష్ట్రంలోనే ఇప్పటి వరకు రెండో స్థానంలో ఉంది. జిల్లాలో కూడా అదే ఊపులో ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొన్ని నియోజకవర్గాలు వెనుకబడగా, అత్యధిక నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదులో విజయవంతమయ్యారు.

- రెండో స్థానంలో ఉండి నియోజకవర్గం
- ఏలూరు, పశ్చిమలో పోటాపోటీగా సభ్యత్వం
- చాలా నియోజకవర్గాల్లో అనూహ్యంగా పెరిగిన శాతం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గడిచిన ఐదేళ్లపాటు రాజకీయ ఒత్తిళ్లకు భయపడకుండా పార్టీ సిద్ధాంతమే ఊపిరిగా నడిచిన తెలుగు తమ్ముళ్లు ఇప్పటికీ అదే ఊపులో ముందుకు వెళుతున్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని కోరిందే తడవుగా క్షేత్ర స్థాయిలో నేతలు, కార్యకర్తలు దృష్టి పెట్టారు. సభ్యత్వంలో కొత్త ఒరవడి సృష్టించేందుకు మహిళలు, కార్మికులు, రైతులు, యువత అన్ని వర్గాలను పార్టీ సభ్యత్వం తీసుకునేవిధంగా ప్రోత్సహించారు. తొలుత సభ్యత్వ నమోదు కొంత గందరగోళంగా ఉన్నా తరువాత పుంజుకుంది. క్లస్టర్ స్థాయిలో నేతలు జనం వద్దకు కదిలారు. ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో టీడీపీకి పూర్తి పట్టుందన్న వాస్తవాన్ని రుజువు చేసుకునేలా సభ్యత్వ నమోదులో దూసుకుపోతున్నారు. ఇప్పటి వరకు పాలకొల్లు నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు కాగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. నియోజకవర్గాల వారీ ఓటర్ల సంఖ్యలో ఎవరెవరు ఎంత శాతం మేర సభ్యత్వ నమోదు చేస్తున్నారనే అంశాన్ని శాతం రూపంలో గుర్తించి ఆ మేరకు ఆయా నియోజకవర్గాల రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో స్థానాలను టీడీపీ అధినాయకత్వం గుర్తిస్తోంది.

ముందున్న మంత్రి నిమ్మల

మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజకవర్గం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో తొలి వరుసలో నిలవడంతో నియోజకవర్గ నేతల ఆనందానికి హద్దు లేదు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వం 98,195కు చేరగా, లక్షకు పైగా అధిగమించాలని నేతలందరూ పట్టుదలతో ఉన్నారు. పార్టీ అధినాయకుడు చంద్రబాబు నాయుడు ఎదుట గర్వంగా తలెత్తుకునేలా చేయడానికి మీ అందరి కృషే కారణమంటూ కార్యకర్తలు, నేతలను మంత్రి రామానాయుడు సైతం అభినందనలతో ముంచెత్తుతున్నారు.

రెండో స్థానంలో ఆర్ఆర్ఆర్

ఉప సభాపతి కె.రఘురామకృష్ణంరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండి నియోజకవర్గం సభ్యత్వ నమోదులో రాష్ట్రం, జిల్లా స్థాయిల్లో రెండో స్థానంలో ఉంది. మొదటి నుంచి రఘురామకృష్ణంరాజు ఒక ప్రణాళిక ప్రకారం పట్టుదలతో సభ్యత్వ నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. నియోజకవర్గంలో 72 వేలకుపైగా సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సంఖ్య మరింత పెరగబోతుంది. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు నియోజకవర్గం టీడీపీ సభ్యత్వ నమోదులో తొలి స్థానంలో ఉంది. ఇప్పటికే 53 వేల మందికిపైగా టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న గన్ని వీరాంజనేయులు ఆది నుంచి కేడర్‌ను అప్రమత్తం చేయడం, ఏ రోజుకారోజు పర్యవేక్షించడంతో ఇది సాధ్యమైంది. ప్రత్యేకించి ఉంగుటూరు నుంచి జనసేన ఎమ్మెల్యే ధర్మరాజు ప్రాతినిధ్యం వహిస్తుండగా ఇక్కడ టీడీపీ తన పట్టు పటిష్టంగానే ఉందనేలా సభ్యత్వ నమోదులో నేరుగా రుజువు చేశారు.

నియోజకవర్గాల మధ్య పోటీ

సభ్యత్వ నమోదులో నియోజకవర్గాల మధ్య పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలోనే జిల్లా, రాష్ట్రంలో ఏమాత్రం వెనుకబడరాదని ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేశ్ దృష్టిలో తాము కచ్చితంగా నిలబడాల్సిందేననే ధోరణిలో సభ్యత్వ నమోదులో జాగ్రత్తలు తీసుకున్నారు. ఏలూరు జిల్లాలో ఏలూరు నియోజకవర్గం 49,854 సభ్యత్వ నమోదుతో రెండో స్థానంలో నిలిచింది. ఎమ్మెల్యే బడేటి చంటి ఏలూరు కార్పొరేషన్ పరిధిలో అత్యధికంగా సభ్యత్వ నమోదు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కైకలూరు నియోజకవర్గంలో స్థానిక నేతలంతా ఉమ్మడిగా కష్టపడి సభ్యత్వ నమోదును 39 వేలకుపైగా తీసుకువెళ్లగలిగారు. దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ 40 వేల సభ్యత్వ నమోదుతో జిల్లాలో నాలుగో స్థానంలో ఉన్నారు.

మంత్రి పార్థసారధి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గం జిల్లాలో ఐదవ స్థానంలో నిలవగా అక్కడ 44,500 మందికి సభ్యత్వం ఇచ్చారు. మొత్తం ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని జరిగిన సభ్యత్వ నమోదును శాతం రూపంలో విశ్లేషించడంతో కొన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వం ఎక్కువ జరిగినా జిల్లా స్థాయి స్థానాల్లో మాత్రం మార్పు కనిపించింది.

జిల్లాలో మూడో స్థానంలో ఆచంట

పితాని సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆచంట నియోజకవర్గం పశ్చిమగోదావరి జిల్లాలో మూడో స్థానంలో నిలవగా ఇక్కడ 32 వేల మందికిపైగా సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న తణుకు జిల్లాలో నాలుగో స్థానం నిలబెట్టుకోగా ఇక్కడ 48 వేల మందికిపైగా టీడీపీ సభ్యత్వం పొందారు. నరసాపురం నియోజకవర్గంకు ఐదో స్థానం దక్కగా ఇక్కడ 25 వేలకుపైగా సభ్యత్వ నమోదు జరిగింది. ఏలూరు జిల్లాలో పోలవరం, చింతలపూడి నియోజకవర్గాలు 6, 7 స్థానాల్లో ఉండగా, పశ్చిమ లో తాడేపల్లిగూడెం, భీమవరం ఇవే స్థానాల్లో ఉన్నాయి. సభ్యత్వ నమోదుకు ఇంకా గడువు మిగిలి ఉండడంతో సాధ్యమైనంత మేర వేగంగా దూసుకుపోయేందుకే ప్రయత్నిస్తున్నారు. సభ్యత్వ నమోదు జరిగిన తీరుపై అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇటు యువనేత లోకేశ్ కూడా సంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.

మునిసిపాల్టీల్లో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

మార్చి 31 వరకు అవకాశం

గతంలో దరఖాస్తులకే అవకాశం

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ పరిధిలో అనధికారిక లేఅవుట్‌లను రెగ్యులర్ చేసేందుకు అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) గడువును ప్రభుత్వం పొగిడించింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు గడువు పెంచుతూ ప్రభుత్వ సెక్రటరీ కె.కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. మే నెలాఖరుతో గడువు పూర్తి కాగా చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. షార్ట్ ఫాల్స్, సకాలంలో సొమ్ములు చెల్లించకపోవడం, చిన్న చిన్న సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేలా సూచనలిచ్చింది. టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. దీని ఆధారంగా మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది గతంలో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్నవారి వివరాలను సేకరించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు.

రేపు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

జిల్లా నుంచి 250 మంది

భీమవరంటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 13న నిర్వహించనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో జిల్లా ప్రజలు భాగస్వామ్యులను చేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తారని, జిల్లానుంచి 5 బస్సుల్లో 250 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 13న ఉదయానికి విజయవాడ తీసుకువెళ్లడానికి ప్రత్యేక కార్యాచరణకు జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో నరసాపురం ఆర్డీవోను నోడల్ అధికారిగా నియమించారు. రవాణా సౌకర్యాలతో పాటు వసతి, భోజన సౌకర్యం ఏర్పాట్లకు సూచనలిచ్చారు.



విలీన గ్రామాలకు నిధుల్లేవు..!

రికార్డులు మునిసిపాలిటీలో.. పంచాయతీలు కాదు!

- జిల్లాలో 16 పంచాయతీలకు శాపం
- అభివృద్ధిలో వెనుకబాటు
- 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించలేదు
- ఆరేళ్లుగా పాలకవర్గ ఎన్నికలు జరగలేదు

భీమవరం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చేరువగా ఉండడం ఆ గ్రామాలకు శాపం. ఆయా గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించినా ప్రస్తుతం మునిసిపాల్టీలో లేవు.. ఇటు పంచాయతీ పాలకవర్గాలు కూడా లేవు.. 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా కేటాయించలేదు. జిల్లాలో 16 గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడిపోయాయి.

జిల్లాలో పట్టణాలకు చేర్చిఉన్న 16 గ్రామాలను మునిసిపాల్టీలలో విలీనం చేసేలా ఆరేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై కొన్ని పంచాయతీలు కోర్టును ఆశ్రయించడం తో సమస్య జటిలమైంది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం విలీన ప్రక్రియను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో విలీన గ్రామాలకు శాపంగా మారింది. సకాలంలో విలీన ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఆ గ్రామాల పరిస్థితి దుర్భరంగా మారింది. పాలకవర్గాలు లేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. పాలకవర్గాలు లేని కారణంగా పంచాయతీలకు రావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఒక పంచాయతీ జనాభా ప్రాతిపదికన ఏడాదికి రూ.30 లక్షలపైనే నిధులు మంజూరయ్యేవి. దాదాపు ఐదేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు లేదు. ఆయా గ్రామాల్లో కోట్ల రూపాయలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల అడ్రస్ లేదు. విలీన ప్రక్రియపై ఇప్పటికీ ఎటువంటి నిర్ణయం వెలువడలేదు.

నిధుల దుర్వినియోగం..!

మునిసిపాల్టీల్లో విలీన ప్రతిపాదిత గ్రామాలకు పాలకవర్గాలు లేకపోవడంతో దాదాపు ఆరేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో కొన్ని గ్రామాల్లో కింది స్థాయి అధికారుల వల్ల కోట్లాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయి. రాయలం పంచాయితీలో రూ.2,30,43,635 దుర్వినియోగమైనట్లు గుర్తించడంతోపాటు గతంలో పనిచేసిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. చిన అమిరం పంచాయతీపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరుగుతోంది. ఇలా విలీలన గ్రామాలకు అన్ని విధాలా ఇబ్బందులుగా మారాయి.

మునిసిపాల్టీలకూ ఇదే పరిస్థితి

జిల్లాలో కీలకమైన భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు మునిసిపాల్టీలలో 16 గ్రామాల విలీన పక్రియ అప్పట్లో కొంత ముందుకు సాగినా కోర్టు ఆటంకాలతో నిలచిపోయిది. దీంతో 16 గ్రామాలతోపాటు, 4 మునిసిపాల్టీలకు పాలకవర్గాలు లేక నిధుల కేటాయింపు లేదు. కొన్ని గ్రామాల రికార్డులను మునిసిపాల్టీలకు అప్పగించినా కోర్టు స్టే కారణంగా విలీనం లేదు. రికార్డులపరంగా ఆయా గ్రామాలు మునిసిపాల్టీల్లో కొనసాగుతున్నాయి. పన్నులు పంచాయతీలు వసూలు చేస్తున్నా మునిసిపాల్టీలలో బకాయిలు చూపించడంతో మునిసిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పంచాయతీలకు మరో ఆర్థిక దెబ్బ

పంచాయతీలకు ఆర్థికంగా అండగా ఉండే నిర్మాణాల ప్లాన్ అప్రూవల్ పంచాయతీల నుంచి కాకుండా 2019 నుంచి యుడా (ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ) ఆధీనంలోకి వెళ్లింది. దీనితో పంచాయతీల ఆదాయానికి గండి పడింది. ప్లాన్ అప్రూవల్ యుడా మంజూరు చేస్తుంది. ఫీజులు కూడా అక్కడే చెల్లించాల్సి ఉంటుంది. జిప్లస్-2, ఎత్తు పది మీటర్ల వరకే పంచాయతీలు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. అంతకు మించిన నిర్మాణాలకు యుడా అనుమతి పొందాల్సిందే. కొనేళ్లుగా పంచాయతీలు కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోయినట్లయింది. యుడా నుంచి గ్రామాలకు రావలసి నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీ ఆదాయం పడిపోయింది. ప్రస్తుతం పన్నుల వసూళ్లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఒక దశలో అభివృద్ధిలో దూసుకుపోయిన గ్రామాలు ఇప్పుడు ప్రభుత్వం అందించే నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి.

మంత్రి హామీ అమలుకు ఎదురుచూపులు

మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ ఇటీవల జిల్లా పర్యటనకు రావడంతో విలీన గ్రామాల పరిస్థితులను ఆయనకు వివరించారు. దీనిపై నిర్ణయం తీసుకుని ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇంతవరకు నిర్ణయం వెలువడకపోవడంతో మంత్రి హామీ అమలు కోసం పలువురు ఎదురుచూస్తున్నారు.





వెలగలపూడి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగరాణి

ఆక్వా జోన్‌పై వెసులుబాటు

- కలెక్టర్ల సమీక్షలో చర్చించిన చంద్రబాబు
- అధికారులు ఉదాసీనత వద్దు
- నాణ్యత లోపించిన సీడ్‌తో ఇబ్బందులు
- పక్కా ప్రణాళికతో రావాలన్న సీఎం
- నెరవేరిస్తే జిల్లా రైతులకు ఊరట

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆక్వా జోన్‌పై వెసులుబాటు కల్పించే దిశగా ప్రభుత్వం ఉందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజులు పాటు నిర్వహించే కలెక్టర్ల సమావేశంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆక్వారంగంపై ప్రధాన చర్చ సాగింది. ఉన్నతాధికారుల ఉదాసీనతను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎండగట్టారు. పక్కా ప్రణాళికతో రావాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా విద్యుత్ రాయితీపై చర్చ సాగింది. నాన్ ఆక్వాజోన్‌లో విద్యుత్ రాయితీ ఇవ్వడం లేదని కలెక్టర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. యూనిట్ విద్యుత్‌ను రూ 1.50 పైసలకు అందిస్తున్నారు. నాన్ ఆక్వాజోన్‌లో ఇప్పటికీ అమలు చెయ్యలేదు. ఆక్వా జోన్‌లో పది ఎకరాల పరిమితి విధించారు. దీని వల్ల జిల్లాలో 2,500 మంది రైతులు విద్యుత్ రాయితీకి నోచుకోలేదు. నాన్ ఆక్వా జోన్‌లో చెరువులకు కూడా ప్రభుత్వ అనుమతి ఉందని కలెక్టర్ వివరించారు. నాణ్యత లేని సీడ్‌తో రైతుల ఇబ్బందులు కూడా ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లింది. దీనిపై చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాయితీ విషయంపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నాణ్యమైన సీడ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, స్థానికంగా సీడ్ హేచరీలను అభివృద్ధి చెయ్యాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రొయ్యసాగులో యాంటీ వైరస్ మందుల వినియోగంతో విదేశీ ఎగుమతులకు ఇబ్బందులను కూడా కలెక్టర్ నాగరాణి సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఆక్వా రంగానికి సమీక్షలో పెద్ద పీట వేశారు.

ధాన్యం సేకరణలో ఆదా

ధాన్యం సేకరణలో రైతులకు మరింత సానుకూల నిర్ణయాన్ని ముఖ్యమంత్రి తీసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు రెండు నుంచి మూడు రోజులు పడుతోంది. ఆ సమయాన్ని తగ్గించాలని పౌర సరఫరాల కార్పొరేషన్ అధికారులకు సూచించారు. అదే జరిగితే జిల్లా రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

ఆంధ్రజ్యోతి



కార్ అండ్ బైక్ రేస్

డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 1

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మొదటి కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి కార్యాలయం :
రాచర్ల రోడ్, అలంపురం, తాడేపల్లిగూడెం,
పశ్చిమగోదావరి జిల్లా - 534166.
బి.యం.: 9985411541, ఎ.సి.యం.: 9985411552

పరిశుభ్రమైన ఆహారం అందించాలి

వ్యాపారులకు జాయింట్ కలెక్టర్ హెచ్చరిక



కరపత్రాన్ని ఆవిష్కరించిన జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ప్రజలకు పరిశుభ్రమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని, అపరిశుభ్రతపై చర్యలు ఉంటాయని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో కేవీజీవీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాన్ ఇండియా పోస్టాక్ ట్రైనింగ్ కార్యక్రమంలో జేసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆహార విక్రయదారులంతా అవగాహన, అనుభవం మాత్రమే కాక భారతీయ ఆహార భద్రత సంస్థ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమమైన పోస్టాక్ కోర్సులలో శిక్షణ పొంది ఉండాలన్నారు. ఆహార సంబంధమైన పరిశుభ్రతలలో భాగమైన వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార నాణ్యత, భద్రత, పరిసరాల పరిశుభ్రత కలిగి వ్యాపారం చేయాలన్నారు. ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా పొంది ఉండాలన్నారు. భీమవరం పట్టణంలో ఫుడ్ కోర్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, ఫుడ్ కోర్టులో వ్యాపారం చేయడానికి శిక్షణ పొందిన వారిలో పరిశుభ్రత పాటిస్తున్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

శిక్షణ లేకుంటే చర్యలు

ఆహార సంబంధ వ్యాపారాలు చేసేవారు లైసెన్సు, పోస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ లేకుంటే కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. తినుబండారంలో కల్తీ లేకుండా చూడడమే లక్ష్యమన్నారు. అనంతరం జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, పోస్టాక్ ట్రైనింగ్ పార్టనర్ కేవీజీఎం కరపత్రాన్ని ఆవిష్కరించారు. భీమవరం పట్టణంలో హోటల్స్, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, టీ స్టాల్స్ వ్యాపారులకు ట్రైనర్ పి.యశోదాదేవి అవగాహన కల్పించారు. సౌత్ ఇండియా కేవీజీవీఎం ఇన్‌చార్జి టి.సింధు, సి.మోహన్ బాబు, జిల్లా టీం హెడ్ వి.మాధవి, పట్టణంలోని వ్యాపారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ఫుల్‌టైమ్/పార్ట్‌టైమ్ విలేకరులు కావలెను

1. ఏలూరు (స్టాఫర్), 2. జంగారెడ్డిగూడెం రూరల్, 3. చింతలపూడి రూరల్ 4. నూజివీడు రూరల్, 5. ఆగిరిపల్లి, 6. తాడేపల్లిగూడెం టౌన్, 7.వీరవాసరం, 8. తణుకు రూరల్

ప్రాంతాల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను.

అభ్యర్థులు ఇంటర్ / డిగ్రీ చదివి వుండాలి.
తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం,
సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం వుండాలి.
పైన పేర్కొన్న అర్హతలున్న అభ్యర్థులు
తేది 12-12-2024 (గురువారం)
ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు
జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

అడ్రస్ : ఆంధ్రజ్యోతి కార్యాలయం
రాచర్ల రోడ్డు, అలంపురం,
తాడేపల్లిగూడెం. ఫోన్ : 08818 -280013



బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమకి ద్వితీయ స్థానం

ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో 10వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళల జట్టు ద్వితీయస్థానం సాధించిందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసరావు తెలిపారు. గెలుపొందిన జట్టును పలువురు అభినందించారు.

గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ఖోఖో పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి నిరంతర సాధన చేస్తూ ముందుకు వెళ్లాలని దెందులూరు శాసన సభ్యుడు చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గోపన్నపాలెం సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఇంటర్ మోరల్ ఖోఖో పోటీలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియాల్ ఆధ్వర్యంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఖోఖో సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పీవీ రంగారావు, ఎరుకల సాంబశివరావు, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి సత్యనారాయణ, జిల్లాలోని పది డిగ్రీ కళాశాలల క్రీడాకారులు పాల్గొనారు



కరాటే విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

కరాటే పోటీల విజేతలకు అభినందనలు

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయసులోనే కరాటేలో రాణించి విదేశాల్లో విజేతలుగా నిలవడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఇటీవల మలేషియాలో జరిగిన కరాటే పోటీల్లో మూడు పతకాలు సాధించిన భీమవరం విద్యార్థులను శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అంజిబాబు, సతీమణి సత్యవాణి అభినందించారు. రంగసాయి మాట్లాడుతూ మలేసియా దేశంలో జరిగిన కరాటే పోటీల్లో భీమవరం ఇమ్మాన్యూయేలు అనాధ ఆశ్రమానికి చెందిన నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీలు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారని, వీరు భీమవరం ఎస్‌జెజీఎం హైస్కూల్లో చదువు తున్నారన్నారు. ఆశ్రమ నిర్వాహకులు పాల్, జ్యోసుల విజయ్ భాస్కర్, గంధం శ్రీదేవి పాల్గొన్నారు.

14న భీమవరంలో జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

భీమవరం అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలు ఈ నెల 14వ తేదీ శనివారం భీమవరం వంశీ కృష్ణ నగర్‌లోని ఓల్గా ఆర్చరీ అకాడమీ నందు నిర్వహించనున్నట్లు ఆర్చరీ జిల్లా అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎల్.జయరాజు తెలిపారు. ఈ పోటీలో విజేతలు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు 01-01-2007 తర్వాత జన్మించి వారై ఉండాలని వారి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు ఫొటోలు రెండు చెప్పున తీసుకుని పోటీలకు హాజరు కావాలని వివరించారు. వివరాలకు 84998 72291 నంబర్‌లో సంప్రదించాలన్నారు.





పందిరి రాట నిలబెడుతున్న కమిటీ సభ్యులు.. మావుళ్లమ్మ ఆలయానికి తాళం వేసిన దృశ్యం

మావుళ్లమ్మ ఉత్సవాలకు శ్రీకారం

పందిరి రాట నిలబెట్టిన కమిటీ సభ్యులు

ఈసారి ఉత్సవాలు 33 రోజులు

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చే నెలలో జరిగే మావుళ్ళమ్మ అమ్మవారి 61వ వార్షిక జాతర మహోత్సవాలకు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పందిర రాట ముహూర్తం చేశారు. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు తుటారపు ఏడుకొండలచే ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లిఖార్జునశర్మ ప్రత్యేక పూజలను చేయించారు. ఉదయం 9-30 నిమిషాలకు పందిర రాటను నిలబెట్టారు. ఈ ఏడాది 33 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. జనవరి 13వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ నాయకులు కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు), రామాయణం గోవిందరావు, రామాయణ సత్యనారాయణ, శ్రీనివాసరావు, నరహరశెట్టి అబ్బులు, మానే బాస్కరరావు, తేజ, ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మూల విరాట్ దర్శనం నిలిపివేత

వార్షిక మహోత్సవాలు సందర్భంగా అమ్మవారికి రంగులువేసే నిమిత్తం బుధవారం నుంచి అమ్మవారి దేవాలయ మూల విరాట్ దర్శనాన్ని నిలిపివేశారు.ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు మల్లిఖార్జునశర్మ అధ్వ ర్యంలో తాళ్ళపూడికి చెందిన జంధ్యాల గంగా ధర్ శాస్త్రి పర్యవేక్షణలో కళాపకర్షణ పూజలు నిర్వహించారు.విఘ్నేశ్వరపూజ, మండపారాధన, హోమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి కళలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కలశంలో నిక్షిప్తం చేశారు. కలశాన్ని వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 24 వరకు ఇక్కడే పూజలు నిర్వహిస్తారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్





భీమవరంలో..



మా ఇష్టం..

భీమవరంలో నో పార్కింగ్ బోర్డు వద్ద ఆటో నిలిపిన దృశ్యం

ఏలూరు, భీమవరంలో అడుగు పెట్టాలంటే అంతా గజి బిజి గందరగోళం..ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి..వాహనాలను అడ్డంగా నిలిపివేయడంతో కార్లపై వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.. ఆ వాహనం తీసేవరకు కారు కదిలే పరిస్థితి ఉండదు.. కొన్ని చోట్ల అయితే సగం రోడ్డు వాహనాలతోనే నిండిపోతుంది...

ఏలూరులో రోడ్డపక్కన బైకులు పార్కింగ్ చేయడంతో కారు వెళ్లేందుకు ఇబ్బంది..

భీమవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రోడ్డులో కారు మధ్యలో ఆపి వేయడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

ఏలూరులో సగానికి పైగా రోడ్డును ఆక్రమించి బైక్‌లను పార్క్ చేసిన దృశ్యాలు







పీచు పరిశ్రమకు గడ్డుకాలం



మార్కెట్‌కు చైనా దెబ్బ

కరోనా తర్వాత తగ్గిన ఎగుమతులు

గతంలో రూ.180 కోట్లు టర్నోవర్

ప్రస్తుతం రూ.100 కోట్లకు పతనం

నష్టాలు తట్టుకోలేక మూసివేస్తున్న యజమానులు



దెందులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమలో కొబ్బరి పీచు పరిశ్రమ ద్వారా యజమానులు లాభాలతో పాటు వేలమంది కార్మికులు ఉపాధి పొందేవారు. కానీ కరోనా తర్వాత చైనా మార్కెట్ లేకపోవడంతో కాలక్రమేణా కొబ్బరి పీచు పరిశ్రమలు తగ్గిపోతున్నాయి. పీచు పరిశ్రమ ద్వారా దెందులూరు, పెదవేగి, ద్వారకాతిరుమల, పెరవలి, అత్తిలి, ఉంగుటూరు తదితర మండలాల్లో పెద్ద స్థాయిలో చిన్నతరహా కొబ్బరి పరిశ్రమలు ఉన్నాయి. కొబ్బరి పీచును ఎక్కువగా సోఫా సెట్లు, కార్పెట్లు, పరుపులు, తాళ్ల తయారీలో వినియోగిస్తారు. ప్రధానంగా మన రాష్ట్రం నుంచి చైనాకు కొబ్బరి పీచు ఎగుమతులు అవుతాయి ప్రభుత్వ లెక్కల ప్రకారం పీచు పరిశ్రమ ద్వారా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలో రూ.180 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతూ ఉండేవి. నెలకు 15 టన్నుల ఉత్పత్తి చేస్తూ ఆరు వేల మంది ఉపాధి పొందేవారు. కరోనా తర్వాత చైనా మార్కెట్ తగ్గడంతో రైతులు నష్టాలు వస్తుండడంతో చిన్నపరిశ్రమల దారులు పీచు పరిశ్రమను మూసివేస్తున్నారు. ప్రస్తుతం రూ.100 కోట్లకు వ్యాపార లావాదేవీలు పడిపోయాయి.

పీచు తయారీ ఇలా..

కొబ్బరి తోటల నుంచి కూలీల ద్వారా కొబ్బరి డొక్కలను సేకరించి పరిశ్రమల ద్వారా పీచు ఉత్పత్తి చేయగా మిగిలిన పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచు తయారు చేయడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది. కిలో పీచు తయారీకి కూలీలు, యంత్రాల నిర్వహణ ఖర్చు ఎనిమిది రూపాయలు అవుతుంది. కరోనా తర్వాత కిలోకు 8 నుంచి 9 రూపాయలే ధర వస్తుండడంతో గిట్టుబాటు కావడం లేదని నిర్వా హకులు వాపోతున్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమ అయిన కొబ్బరి పీచు పరిశ్రమ అభి వృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సబ్సిడీ రుణాలు, రాయితీపై విద్యుత్ అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

నష్టాలు రావడంతో మూసివేశా



కొబ్బరి పీచు పరిశ్రమలకు విద్యుత్‌లో రాయితీ కల్పించాలి. కరోనా తర్వాత ఆశించినంతగా మళ్లీ ఎగుమతులు లేవు. ఖర్చులు పెరిగి నష్టాలు వస్తుండడంతో పరిశ్రమ నడపలేక మూసివేశాను.

-తిరుమలరావు, విజయరాయి

విద్యుత్ రాయితీ ఇవ్వాలి



కొబ్బరి పీచు పరిశ్రమ చిన్న తరహా పరిశ్రమ కావడంతో మార్కెట్ హెచ్చు తగ్గులు వల్ల ఎగుమతులు నిలిచిపోతుంటాయి. ఆ సమయంలో తయారైన పీచును నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు, అగ్నిప్రమాదాల కారణంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం చిన్న పరిశ్రమలకు 80 శాతం రాయితీతో విద్యుత్‌ను అందించాలి.

పి.అచ్యుత రామరాజు,జోగన్నపాలెం

కనువిప్పు గలిగించే 'అనూహ్యాం'

తోలేరులో ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు



(వీరవాసరం) భీమవరంటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం తోలేరులో నిర్వహిస్తున్న జాతీయస్థాయి అలరిస్తున్నాయి. బుధవారం ప్రదర్శించిన అనూహ్యం నాటకం నేటి సమాజంలో తల్లి తండ్రులు సంపాదించిన ఆస్తులను ఎలా దక్కించుకోవాలనే చేసే కుటిల యత్నాలను, మోసాలను తండ్రి గ్రహించి ఎలా బుద్ధిచెప్పాడనేది ఈ నాటిక సారాంశం...పాలకొల్లుకులోని నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన అనూహ్యం చూసిన ప్రేక్షకులను ఆలోచింపచేసింది. పిల్లలపై మమకారం పెంచుకుంటున్న తల్లితండ్రులకు ఈ నాటిక కనువిప్పు కలిగించడం ఖాయం. కొడుకులు వారసత్వ సంపదను అనుభవించడం కోసం బిచ్చగాళ్ళలా ఎదురు చూడకుండా స్వయం కృషితో ఆత్మాభిమానంతో జీవించాలనే సందేశంతో ఈ నాటిక సాగింది. ఇందులో ప్రతీ పాత్రదారుడు ఎంతో అద్భుతంగా నటించారు. తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచయిత కాగా కత్తుల రామ్ మోహన్ దర్శకత్వం వహించారు. అదే విధంగా గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' నాటిక ఆకట్టుకుంది. ఈ నాటికల ప్రదర్శనతో జాతీయస్థాయి నాటిక పోటీలు ముగిశాయి. విజేతలకు గురువారం బహుమతి ప్రదానం నిర్వహించనున్నారు.



పోలవరం డీఎస్పీ కార్యాలయానికి కొత్త కళ

పోలవరం డీఎస్పీ కార్యాలయం జాతీయతా భావం ఉట్టిపడేలా జాతీయ జెండా రంగులతో కళకళలాడుతోంది. పోలవరం సబ్ డివిజన్ ఏర్పడిన తర్వాత ఆరుగురు డీఎస్పీలు సబ్ డివిజన్ పరిధిలో పని చేశారు. నూతన డీఎస్పీగా వెంకటేశ్వరరావు బదిలీపై వచ్చిన తర్వాత పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయానికి రంగులు వేయించారు. కళకళ లాడుతున్న కార్యాలయం అక్కడికి వచ్చే అధికారులు, సిబ్బంది దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నది.

- పోలవరం

వచ్చేనెల 10న శ్రీవారి ఉత్తర ద్వారదర్శనం

ద్వారకాతిరుమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వచ్చేనెల 10న శ్రీవారి ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆరోజు తెల్లవారు జామున 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఉత్తరద్వారం వద్ద శ్రీవారు ఉభయ దేవేరులతో వెండి గరుడ, శేష వాహనాలపై కొలువై భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. అదేరోజు సాయంత్రం నుంచి ప్రారంభమై 20 వరకూ అధ్యయనోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయా రోజుల్లో రాత్రివేళ జరిగే ఆర్జిత ఉత్సవాలు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి నాడు స్వామివారి ఆర్జిత కల్యాణం రద్దు చేస్తున్నట్లు వివరించారు. జనవరి 9న తొలిమెట్టు నుంచి స్వామివారి శేషాచలం చుట్టూ మధ్యాహ్నం 2.30 గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభమవు తుందని గిరిప్రదక్షిణ అనంతరం స్వామివారి నిజరూప దర్శనం ఏర్పాటు చేశామని ఈవో వివరించారు.

భీమేశ్వరస్వామి ఆదాయం రూ.3.15 లక్షలు

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో హుండీల ఆదాయం బుధవారం లెక్కించగా 9 నెలలకు గాను 2 లక్షల 34 వేల 148 రూపాయిలు ఆదాయంగా వచ్చిందని ఆలయ ఇవో తోట శ్రీనివాస రావుతెలిపారు.. కార్తీక మాసం, సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా దర్శనం,అభిషేకం టికెట్స్ ద్వారా రూ 81,040 వచ్చిందని వివరించారు మొత్తం 3 లక్షల 15 వేల 188 రూపాయిలు ఆదాయంగా వచ్చిందన్నారు.

ఆదర్శమైన జీవన విధానానికి ఆధ్యాత్మిక తత్వం అవసరం

డాక్టర్ ఉమర్ అలీషా

అత్తిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శమైన జవన విధానానికి ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక తత్వాన్ని అలవర్చుకోవాలని పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలు సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు. బాల్యదశ నుంచి క్రమశిక్షణతో కూడిన ఉన్నత విలువలను పెంపొందించుకోవాలని కోరారు. భగవద్గీత మానవ నడవడికను తెలియజేస్తుందన్నారు. త్రయ సాధన ద్వారా మానవ జీవన విధానాన్ని ముక్తిమార్గంతో పయనించేలా చూసుకోవాలన్నారు. రెడ్డి ఉషారాణి తాత్విక జ్ఞాన ఉపన్యాసం ఇచ్చారు. పోలిశెట్టి ఉషాపావని భక్తి గీతాలను ఆలపించారు. గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు పీఠం ప్రాధాన్యతను వివరించారు. ఉమర్ అలీ షాను షష్టి కమిటీ సభ్యులు సత్కరించారు. పీఠం కన్వీనర్ ఆడబాల వెంకటరత్నం, ఇర్రి ప్రసాద్, నందం తాతాయ్య పాల్గొన్నారు.



ఘనంగా సహస్ర దీపారాధన

ముదినేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సహస్ర దీపారాధనలు, సహస్ర లింగార్చన వైభవంగా జరిగాయి. స్వామి వార్లకు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలను అర్చకులు తోలేటి వీరభద్రశర్మ, గూడూరు రామకృష్ణ శర్మ నిర్వహించారు.

భారమైన బంతి సాగు



పడిపోయిన ధరలు

ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంట

గిట్టుబాటవక రైతుల ఇబ్బందులు

లింగపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో పంట చేతికివచ్చి ఎక్కువ ఆదాయాన్ని అందించే బంతి పూలతోటల సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. సీజన్‌లకు అణుగుణంగా బంతిపూలను మార్కెట్‌లో కిలో ఎనభై రూపాయల నుంచి వంద రూపాయల వరకు విక్రయిస్తున్నారు. పెళ్లిళ్లకు, పండుగల సమయంలో బంతిపూలకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. ఎకరాకు యాభైవేల నుంచి అరవైవేల వరకు ఖర్చు అవుతుంది. ధర బావుంటే లక్షన్నరకుపైగా ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇటీవల వచ్చిన పండుగల సీజన్ వరకు లాభాలు తెచ్చిపెట్టిన బంతిపూలపంట దసరా తర్వాత ధరలు తగ్గి రైతులకు కొంత మేరకు నష్టాలు మిగిల్చాయి.ఇటీవల కురుస్తున్న వర్షాలకు బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. కిలోవంద పలికిన పూలధర నేడు ముప్పై రూపాయలకు కూడా కొనడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా రావడం లేదు



ఎకరం భూమిలో బంతి తోట సాగుచేశాను. బిగ్‌బాల్ రకం విత్తనం ఎకరాకు పదివేల వరకు నాటాను. దసరా పండుగ ముందు వరకు పంట దిగుబడి బాగా ఉండటంతో కిలో పూలధర వంద రూపాయల వరకు పలికింది. ప్రస్తుతం మండలంలో బంతితోటలు ఎక్కువగా ఉండటంతో పాటు వరుసగా కురుస్తున్న వర్షాలతో కొంతమేర బంతి తోట దెబ్బతింది. కిలో నలభై రూపాయలన్నా కొనడం లేదు. ఏలూరు మార్కెట్‌కు తీసుకువెళ్లి తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తుంది. ఎకరాకు యాభైవేల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టాను. పెట్టుబడి రావడమే గగనంగా మారింది.

-జుజ్జూరి శివయ్య, రైతు, కొత్తపల్లి, లింగపాలెం మండలం



రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు పూలతోటలు, పండ్ల తోటలపై శాస్త్రవేత్తలతో ప్రతి పదిహేను రోజులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పూలసాగులో బంతి తోటలు ముఖ్యమైనవి. బంతితోటలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను అందిస్తాయి. ప్రణాళికా బద్ధంగా పూలతోటల సాగు చేస్తూ సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చు. బంతి తోటలకు లద్దెపురుగు, నులిపురుగు, మొగ్గకుళ్లు, వేరుకుళ్లు లాంటి తెగుళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పూలు, పండ్ల తోటలు సాగుచేసే రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదిస్తే తోటలను పరిశీలించి పంటలో తెగుళ్ల నివారణకు సరైన సూచనలు ఇస్తారు.

షాఫియా పర్వీన్, ఉద్యానశాఖ అధికారిణి, లింగపాలెం మండలం


శరవేగంగా డయాఫ్రం గైడ్ వాల్ నిర్మాణం



పోలవరం ప్రాజెక్టులో డయా ఫ్రం వాల్ గైడ్ వాల్ నిర్మాణ పనులు

- 80 మీటర్ల వరకు కాంక్రీటు పనులు పూర్తి
- తవ్వకాలు జరిపేందుకు ట్రెంచ్ కట్టర్లు సిద్ధం
- వరదలకు దెబ్బతిన్న రోడ్డు 90% పూర్తి

పోలవరం డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన నూతన డయా ఫ్రం వాల్ నిర్మాణానికి అవసరమైన గైడ్ వాల్ పనులు ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న ప్రాజెక్టు వద్దకు వచ్చి.. నిర్మాణ పనుల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు వివిధ కట్టడాల పనులను వేగవంతం చేశారు. నూతన డయా ఫ్రం వాల్ నిర్మాణానికి అవసరమైన ప్లాట్‌ఫారాన్ని సిద్ధం చేశారు. వాల్ నిర్మాణ ప్రాంతానికి ఇరువైపులా ఐదు గైడ్‌వాల్స్ కాంక్రీట్ పనులు వేగంగా చేస్తున్నారు. ఇప్పటికే 80 మీటర్ల మేర ఈ కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. గతంలో మాదిరిగా ఈ సారి కూడా డయాఫ్రం వాల్‌ను 1,396 మీటర్ల పొడవున, ఐదు మీటర్ల వెడల్పున నిర్మిస్తున్నారు. గోదావరి అడుగున ఇసుక సిల్టు, మట్టిపొరల నుంచి ఎర్త్‌కం రాక్ ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాంలో సీపేజీ రాకుండా నివారించే ప్రక్రియలో భాగంగా నూతన వాల్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం నదీతలం అడుగు భాగాన సుమారు 100-150 మీటర్ల లోతు వరకూ ప్రాంతాన్ని బట్టి రాతి పొరలు తగిలే వరకూ తవ్వకాలు జరిపేందుకు ట్రెంచ్ కట్టర్ యంత్రాలను సిద్ధం చేశారు. ఈ యంత్రాలను వినియోగానికి అనువుగా బిగించడానికి సుమారు 20 రోజులు పడుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గత 5 నెలలుగా డయాఫ్రం వాల్ ప్రాంతంలో ఇరువైపులా శాండ్ ఫిల్లింగ్, మట్టి , ఇసుక రాతి నమూనాల సేకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఈసీపీటీ యంత్రంలో కెమెరా ప్రెషర్ ద్వారా సెన్సర్లను భూమిలోకి పంపి ల్యాప్‌ట్యాప్ డిస్‌ప్లే ద్వారా నదిలో మట్టి, రాతి పొరల స్థితిగతుల అంచనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-2 ప్రాంతంలో వైబ్రో కంపాక్షన్ పనులు నిర్వహించడం ద్వారా భూమిని గట్టిపరిచే పనులు వేగవంతంగా చేస్తున్నారు. వాల్ ప్రాంతానికి మట్టి, రాళ్ల తరలించేందుకు స్పిల్ చానల్ నదీ ప్రవాహంపై ఈ ఏడాది వరదలకు దెబ్బ తిన్న రోడ్డును 90 శాతం వరకు పునరుద్ధరించారు. ప్రవాహానికి ఆటంకం లేకుండా ఈ రోడ్డు మార్గంలో పలుచోట్ల భారీ ఇనుప తూములను ఏర్పాటు చేశారు. మరో 100 మీటర్ల రోడ్డు పనులు ఈ వారంలో పూర్తవుతాయని ఈఈ వెంకటరమణ వెల్లడించారు. గైడ్‌వాల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఈఈ సుధాకర్, డీఈ మల్లికార్జునరావు తెలిపారు.



రాళ్ల తరలింపునకు సిద్ధమైన రోడ్డు



సిద్ధం చేసిన ట్రెంచ్ కట్టర్ యంత్ర సామగ్రి



రామరాజు సంతాపసభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ఆడిటర్ రామరాజు విగ్రహం ఏర్పాటు చేయిస్తా : మంత్రి నిమ్మల

పాలకొల్లు, డిసెంబరు 11 : ఛాంబర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కలిదిండి రామరాజు విగ్రహాన్ని విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసేందుకు తాను బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఇటీవల మరణించిన రామరాజు సంతాప సభ క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందరంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో సంస్థలకు సేవలందించిన రామరాజు పేరును మున్సిపల్ కాంప్లెక్స్‌కు పెట్టడానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఏటా సంక్రాంతికి నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్‌పోటీలకు ఈసారి రామరాజు పేరుతో నిర్వహించడం జరుగుతుందని మంత్రి నిమ్మల తెలిపారు. తండ్రి వంటి రామరాజు లేని లోటు తనకు తీరనిదన్నారు. 1982 నుంచి టీడీపీ సభ్యుడిగా ఉంటూ ఎంతో సేవలు అందజేసారని తెలిపారు. క్షత్రియ సంక్షేమ పరిషత్, కాస్మో స్పోర్ట్స్ కల్చరల్ క్లబ్, ఛాంబర్ కళాశాలల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా రామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

16 మందికి సీఎం సహాయనిధి చెక్కులు

పాలకొల్లు అర్బన్: పేదల వైద్య చికిత్సకు సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతగానో ఉపయోగపడుతోందని మంత్రి రామానాయుడు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో నియోజకవర్గంలోని 16 మంది లబ్ధిదారులకు రూ. 8.20 లక్షల చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం కక్షలు, వేధింపులు, కేసులతో పేదవర్గాల వారిని పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి వారం నియోజక వర్గంలోని ప్రజల వైద్య ఖర్చులకు లక్షలాది రూపాయలు తీసుకువచ్చి అందించడం జరుగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నాయకులు జివి, గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి పెద్దిరాజు,బోనం నాని, ఉన్నమట్ల కపర్థి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కోమటిలంక గ్రామస్థులు

'కొఠారు' సొమ్ము ఇచ్చే వరకు ఆందోళన

ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): చెరువుల లీజు సొమ్ము ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే తమ కష్టార్జితాన్ని మింగేశారని, సొమ్ము ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని, లంక గ్రామాల వాసులు హెచ్చరించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి వద్ద కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు చేపట్టిన ఆందోళనను బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి, ఆయన తండ్రి రామచంద్ర రావు కలిసి తమ కష్టార్జితాన్ని దిగమింగేశారని ఆరోపించారు. కోట్లు ఖర్చుపెట్టి చెరువులు తవ్వుకున్నామని, 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన అబ్బయ్యచౌదరి దౌర్జన్యంగా చేపల చెరువు లీజు సొమ్మును తనవద్దే పెట్టుకుని తమ పొట్టకొట్టారని ఆరోపించారు. కాజేసిన సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. వీరి ధర్నాకు తిమ్మారావు గూడెం, మానూరు, లింగారావు గూడెం తదితర గ్రామా ల టీడీపీ నాయకులు మద్ధతు తెలిపారు. చెరువులీజు డబ్బులు సుమారు రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొల్లేరు నాయకులు సైదు సత్యనారాయణ, పార్టీ మండల అధ్య క్షుడు నంబూరి నాగరాజు, మాజీ అధ్యక్షుడు నేతల రవి, నాయకులు మోరు రామరాజు, జయమంగళ దొరబాబు, మెండ్రు చిన్ని, జి.వెంక న్నబాబు, చేబ్రోలు జాన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బయ్య చౌదరిపై సైదు ఫైర్

చింతమనేని కుట్ర వల్లే టీడీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్న అబ్బయ్య చౌదరి వ్యాఖ్యలను కొల్లేరు సీనియర్ నాయకుడు, టీడీపీ నేత సైదు గోవర్ధన్ తీవ్రంగా ఖండించారు. మాదేపల్లిలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 2019లో అబ్బయ్య చౌదరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సోమవరప్పాడులో వలసపల్లి చేపల చెరువు అన్యాయంగా వైసీపీ కార్యకర్తలతో పట్టుపడి చేయించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అనేక అరాచకాలు చేసి ఇప్పుడు చింతమనేనిని విమర్శించటం తగదని, అవాకులు, చవాకులు పేలితే సహించమన్నారు.

రేపటి నుంచి ఎస్సీ, ఎస్టీ హక్కుల వేదిక సమావేశాలు

భీమవరం టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య బుధవారం తెలిపారు. తొలిరోజు విజయవాడ సిద్ధార్థ అకాడమీలో, రెండో రోజు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భవనంలో ఉదయం నుంచి జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కే శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పరశురాం, హాజరవుతారన్నారు. సమావేశాల్లో వేదిక హక్కులు, ఆశయాలపై వివరిస్తారని, రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ, తీర్మానం ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రెగ్యులర్, ప్రైవేటు విదార్థులకు వచ్చే ఏడాది మార్చి 17నుంచి 31వతేదీ వరకు జరుగుతాయని ఏలూరు డీఈవో వెంకట లక్ష్మమ్మ, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ తెలిపారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు మాత్రం 50 మార్కుల చొప్పున, మిగతా ప్రధాన సబ్జెక్టుల పేపర్లన్నీ 100మార్కుల చొప్పున పరీక్షలు జరుగుతాయని వివరించారు.

మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12గంటలవరకు పరీక్షలు జరుగుతాయి. ఉత్తీర్ణతకు తప్పనిసరి అర్హతా పరీక్షలైన నైతికత, మానవ విలువల పరీక్ష ఫిబ్రవరి ఒకటోతేదీన, పర్యావరణ విద్య పరీక్ష ఫిబ్రవరి 3న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు సంబంధిత కళాశాలల్లోనే నిర్వహిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ కోర్సులకు ఫిబ్రవరి 10నుంచి 20వరకు, ఒకేషనల్ కోర్సులకు ఫిబ్రవరి 5నుంచి 20వరకు రోజుకు రెండు సెషన్లలో ఉదయం 9నుంచి 12గంటలవరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని ఇంటర్‌బోర్డు జిల్లా అధికార వర్గాలు తెలిపాయి.

ఏలూరు జిల్లాలోని 135 జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 18,449 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,019 మంది చదువుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 121 జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 19,762 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17, 574 మంది చదువుతున్నారు.

17 అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు

అగ్నిమాపక శాఖ అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు



అధికారులకు సూచనలిస్తున్న శ్రీనివాసులు

భీమడోలు, డిసెంబరు 11(ఆంధ్ర జ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల 15వ ఆర్థిక సంఘం నిధులతో 17 కొత్త అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అలాగే 35 అగ్నిమాపక కేంద్రాల ఆధునికీకరణ చేయనున్నట్లు స్టేట్ ఫైర్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి స్థానిక అధికా రులకు తగు సూచనలు ఇచ్చారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రంలో హైడ్రాలిక్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు, ఫోన్‌కాల్స్ ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా నూతన టెక్నాలజీతో ఎక్విప్ మెంట్‌ను ఏర్పాటు చేస్తామ న్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కెమికల్ పరిశ్ర మల్లో ప్రమాదాల నివారణకు సీబీఆర్ ఎక్విప్ మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లుగా, వరద ముంపు ప్రాంతాల్లో మరిన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయప డిన క్షతగాత్రులను రక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. భీమడోలు అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన
- తక్షణం భారం తగ్గించాలన్న జిల్లా కార్యదర్శి బలరాం

భీమవరం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):విద్యుత్ అదనపు ఛార్జీల పేరుతో సామాన్యులపై భారం వేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ బిల్లులను నిరసిస్తూ బుధవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేసి కరెంట్ బిల్లులను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరంలో సర్వీస్ నెం.0801042523లో విద్యుత్ వినియోగం ఖర్చు రూ.27.72 అయితే ఫిక్స్‌డ్ ఛార్జీ రూ. 30, కస్టమర్ ఛార్జీ రూ. 25, ఇంధనం సర్దుబాటు ఛార్జీ-1 రూ. 267.36, ఇంధనం సర్దుబాటు ఛార్జీ -2 రూ. 102 కలిపి మొత్తం రూ. 447.33లు కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 6 శాతం వినియోగం బిల్లు అయితే 94 శాతం బిల్లు అదనపు భారాలు అని తెలిపారు. 2014 నుంచి వాడుకున్న విద్యుత్‌కి ట్రూ అప్ ఛార్జీలు ఇంకా వెయ్యలేదని ప్రభుత్వం చెబుతుందని, అవి కూడా వేస్తే ప్రజలపై మరింత భారం పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ బాదుడును నియంత్రిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు ఇప్పుడు రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రకటించి మేనిఫెస్టోకు విరుద్ధంగా ప్రజలపై భారం వెయ్యడం తగదన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.వైకుంఠరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావు కన్నుమూత



ఉంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరుకు చెందిన విశ్రాంత ఉమ్మడి ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుంకవల్లి పర్వతరావు (90) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హైదరాబాదులో మృతి చెందారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈయన స్వగ్రామమైన ఉంగుటూరులో 35 ఎకరాల భూమిని గౌతమి సేవా సంస్థకు అందించారు. 5 ఎకరాలలో గోశాల (గోపాలకృష్ణ గోశాల) నిర్మించారు. సొంత నిధులతో ఉంగుటూరులో భారతీయ విద్యా కేంద్రంను నిర్మించి విశాఖ పట్నం లోని బి.వి.కే.కు అప్పగించా రు. ఆయన మృతికి స్థానిక భారతీయ విద్యాభవన్స్ శాఖ కరస్పాండెంటు పాతూరి వంశీ కృష్ణ సంతాపం తెలిపారు.

ఏపీ నిట్‌కు విద్యుత్ కారు వితరణ

బహూకరించిన కెనరా బ్యాంక్



కారును ప్రారంభించిన డైరెక్టర్ రమణారావు

పెంటపాడు, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ఏపీ నిట్ అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినంద నీయమని ఏపీ నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు కొనియాడా రు. తాడేపల్లిగూడెం కెనరా బ్యాంకు బ్రాంచి నుంచి ఏపీ నిట్ విద్యార్థుల సౌకర్యార్థం రూ.9 లక్షల విలువైన విద్యుత్ కారును అందించారు. ఈ సందర్భంగా కారును ప్రారంభించిన డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ ఈ వాహనాన్ని విద్యార్థుల కోసం వినియోగిస్తామని విద్యార్థులు వసతి గృహాల నుంచి తరగతి గదులకు అక్కడ నుంచి వసతి గృహాలకు వెళ్లడానికి ఈ వాహనం ఉప యోగపడు తుందన్నారు. కెనరా బ్యాంకు జీఎం పిజె విజయలక్ష్మి, ఏజీఎం రామ చంద్ర, తాడేపల్లి గూడెం జీఎం జనార్దనరెడ్డి, డీన్లు డాక్టర్ శాస్త్రి, డాక్టర్ కురుమయ్య, డాక్టర్ జీవి వీరేశ్‌కుమార్, జయరాం, సందీప్ పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

EDUCATION
BPT/B. Sc .MLT COURSES IN VIJAYAWADA -ELIGI:INTER BI.PC/ VOC MLT/ INTER WITH BI.PC BRIDGE COURSE-RECOG.BY DR.NTRUHS & PARAMEDICAL COUNCIL - SCHOLARSHIPS & HOSTELS AVAILABLE ✆ 78936 74699
AJB - 225275

GOLD FINANCE
బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368
AJB -225408

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్టవ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

క్రైమ్ కార్నర్

ఉప్పుటేరులో వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

మొగల్తూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరులో వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందినట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. పేరుపాలెం సౌత్ పంచాయతీ లైను పల్లవపాలేనికి చెందిన తిరుమాని నిరంజనరావు (24) మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఉప్పుటేరులో వేటకు వెళ్ళాడు. వేట సమయంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి వడ్డికాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరి కోతలు కోస్తుండగా పాముకాటు.. మహిళ మృతి

పెదపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం దెందులూరు మండలం పోతునూరుకు చెందిన అడ్డారి ఆదిలక్ష్మి(40) అదే గ్రామానికి చెందిన కూలీలతో కలసి మంగళవారం కొత్తూరులో వరి కోతలు కోస్తుండగా పాము కాటుకు గురైంది. తోటి కూలీలు ఆమెను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిరాలికి ఇద్దరు కుమార్తెలున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏం కష్టమొచ్చిందో తెలీదు ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోడూరు మండలం వేడంగి గ్రామానికి చెందిన చెల్లుబోయిన సింహాద్రి (35)కి వివాహం కాలేదు. కొబ్బరికాయలు కోసే పనికి వెళ్తా ఉంటాడు. బుధవారం ఉదయం అతను పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు అతనిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టు మార్టంకు మార్చురీకి తరలించారు.

కాలం చెల్లిన పచ్చళ్ల అమ్మకం

ఆకివీడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హానికరమైన వస్తువులు అమ్ముతున్న వర్తకులపై క్రిమినల్ కేసులు పెడతామని ఫుడ్ సేఫ్టీ ఉమ్మడి జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అటకెక్కిన ఫుడ్ సేఫ్టీ తనిఖీలు' వార్తకు స్పందించిన అధికారులు మార్ట్‌ను పరిశీలించి కాలం చెల్లిన వస్తువులు స్వాధీనం చేసుకొని, పచ్చళ్లు సీల్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యానికి హానికరమైన వస్తువులు అమ్మినందుకు 18 క్రిమినల్ కేసులు, కాలం చెల్లిన వస్తువులు అమ్ముతున్న వారిపై 25 కేసులు నమోదు చేశామన్నారు. స్థానిక మాదివాడలో నిర్వహిస్తున్న మార్ట్‌లో కాలం చెల్లిన వస్తువులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

పచ్చళ్ళకు సంబంధించి వాటిని సీల్ చేసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతామని, నివేదిక వచ్చిన తరువాత తదుపరి చర్యలు ఉంటాయన్నారు. వీరివెంట ఫుడ్‌సేఫ్టీ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎ. సుందరరామిరెడ్డి, నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.సాకేత్ సిబ్బంది ఉన్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మోటారు సైకిళ్లు మాయం

ఏలూరు క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీ వైఫల్యంతో మోటారు సైకిళ్ళు అపహరణకు గురవుతున్నాయి. బుధవారం ఏకంగా రెండు మోటారు సైకిళ్ళు అపహరణకు గురవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉంగుటూరు మండలం నీలాద్రిపురానికి చెందిన తానంకి వినోద్‌కుమార్ ఏలూరు ప్రభుత్వాసుపత్రి తల్లీబిడ్డల విభాగంలో ఉన్న బంధువును చూసేందుకు తన కుటుంబీకులతో సహా బుధవారం సాయంత్రం వచ్చాడు. ఎంసీహెచ్ బ్లాక్ పక్కన మోటారు సైకిల్ పార్కింగ్ ప్లేసులో పార్క్ చేసి లోపలికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి మోటారు సైకిల్ అపరహరణకు గురైంది. అక్కడ సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ లేరని బాధితుడు వాపోతున్నాడు. బుధవారం ఉదయం ఒక మోటారు సైకిల్ ఆసుపత్రి ఆవరణలోనే అపహరణకు గురవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమేరాలు తూతూ మంత్రంగానే పనిచేస్తున్నాయి. ఆసుపత్రి అధికారులు తక్షణం సెక్యూర్టీని ప్రక్షాళన చేసి ఆసుపత్రికి వచ్చే వాహనాలకు రక్షణ కల్పించాలి. సీసీ కెమేరాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి చర్యలు తీసుకోవాలి.

బ్యూటీషియన్ మరణానికే భర్తే కారణం !

ఏలూరు క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బ్యూటీషియన్ మరణానికి ఆమె భర్తే కారణమని ఏలూరు టూ టౌన్ పోలీసులు బుధవారం అతనిని అరెస్టు చేశారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన కాలి ప్రియాంక(25) హైదరాబాద్‌లో బ్యూటీషియన్‌గా పనిచేసేది. ఆమె తండ్రి ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. తండ్రికి సహాయంగా ఉన్న ప్రియాంకతో ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కండ్రికగూడెంకు చెందిన తెల్లం శ్రీకాంత్ ప్రియాంకను పరిచయం చేసుకున్నాడు. తనకు ఇంకా వివాహం కాలేదని ఆమెను పెళ్లి చేసుకుని ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడ కాపురం పెట్టాడు. అయితే అప్పటికే శ్రీకాంత్‌కు అదే ఆసుపత్రిలో పనిచేసే ఒక నర్సును పెళ్ళి చేసుకున్నాడన్న విషయంపై వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్రియాంక వద్ద లక్షలాది రూపాయలు తీసుకోవడంతో గొడవలు మరింత ఎక్కువయ్యాయి. ప్రియాంక మనస్థాపానికి గురై ఈ నెల 1న ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.

ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగకల్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మరణానికి భర్తే కారణమంటూ బుధవారం అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు కోర్టు రిమాండ్ విధించింది. దీంతో అతనిని జిల్లా జైలుకు తరలించారు.

వైసీపీకి 'సంకు' గుడ్‌బై



నాగ శేషు

నిడమర్రు డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను, కార్యకర్తలను వైసీపీ అధినేత జగన్మోహన రెడ్డి నేటికీ గుర్తించక పోవడం వల్లే పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ సంకు నాగ శేషు తెలిపారు. భువ్వ నపల్లి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఓడిపోయి ఆరు నెలలు గడుస్తున్నా నేటికి నియోజక వర్గాలలోని కార్యకర్తలను ఏ మాత్రం పట్టించుకోకుండా పార్టీ ఓటమి కారణాలకు అంతర్మధనం చేయకపోవడం దారణమన్నారు. ఆయన వెంట గల పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ పార్టీ బాధ్యులు అభిప్రాయం మేరకు పార్టీకి రాజీనామా చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో వారందరితో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

నగల దుకాణంలో చోరీ యత్నం

దొంగకు దేహశుద్ధి

భీమవరం క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగారు వస్తువులు కొంటానని దుకాణాల్లోకి వెళ్ళి దొంగిలించుకుపోతున్న యువకుడిని వ్యాపారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం ఒక యువకుడు భీమవరంలోని బంగారు దుకాణాల మార్కెట్‌లో కలియతిరిగాడు. సుమారు 8 షాపుల్లోకి వెళ్ళి కొనుగోలుదారులా నటించడంతో వ్యాపారులు ఆభరణాలు చూపించారు. ఒక దుకాణంలో రెండు హారాలు పట్టుకుని పారిపోతుండగా ఆ వ్యాపారి కేకలు వేయగా కొంత మంది వెంటపడి పట్టుకుని దేహశుద్ధి చేసి వదిలివేశారు. తనది గునుపూడి అని మాత్రమే తెలిపాడు. అయితే తన పేరు వెల్లడించలేదు. కాగా భీమవరం రెండవ పట్టణంలోని టాక్సీ స్టాండ్ వద్ద ఇతను అనుమానంగా తిరుగుతుండగా టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 3 లేడీస్ హ్యాండ్ బ్యాగులు, కొంత నగదు, నాలుగు బంగారు గాజులు, మరి కొంత బంగారం దొరికినట్టుగా సమాచారం. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

కూటమి బలోపేతానికి కలిసి పనిచేద్దాం : పితాని

ఆచంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ బలోపేతానికి రానున్న రోజుల్లో మూడు పార్టీలు కలిసి పనిచేద్దామని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆచంటలోని శ్రీరామేశ్వరస్వామి సత్రం వద్ద నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల గ్రామ మండల నియోజకవర్గ సమన్వయ కమిటీల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒకే మాట మీద కూటమి నాయకులు ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న వలంటరీ వ్యవస్థ మనకొద్దు అంటూ మరోసారి గుర్తుచేశారు. గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం నాలుగు మండలాల్లో కూటమి నాయకులు మాట్లాడుతూ కూటమిలో ఎటువంటి విభేదాలు లేకుండా అందరం ఐక్యతగా ఉంటూ ఎమ్మెల్యే పితానికి పేరుతెచ్చే విధంగా పని చేద్దామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న కారణంగా మళ్లీ పోలవరం ప్రాజెక్టు సందర్శనకు అవకాశం కల్పించాలన్నారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వెంకటరామరాజుతోపాటు ఆయా పార్టీల అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆరుగొలను పర్యటన సందర్భంగా ఆయన బుధవారం కూడలిలో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ మహిళలు, రైతులు, నాయకులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ పీతల బుచ్చిబాబు, టీడీపీ నాయకులు వట్టూరి రాంబాబు, మాజీ సర్పంచ్ మలకా వెంకట్రావు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



నాగిడిపాలెం పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న తోట సీతారామలక్ష్మి

నాగిడిపాలెం మత్స్యకార సొసైటీ సభ్యులకు అభినందన

భీమవరం అర్బన్, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి) : భీమవరం మండలం నాగిడిపాలెం ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన పాలకవర్గ సభ్యులను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అభినందించారు. మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ అనుచరవర్గ నూతన పాలకవర్గ సభ్యులతో తోట సీతారామలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీ ద్వారా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ సలహాలు, సూచనలతో అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలని అగ్నికుల క్షత్రియుల సమస్యల పరిష్కారానికి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం నాగిడిపాలెంకు చెందిన నాగిడి సుబ్బారావు, నాగిడి సాయి బంధన పృథ్వీ శంకర్, పొన్నమండ శివశంకర్, కొక్కిరిగడ్డ సింధు, నాగిడి రాధాకృష్ణ, నాగిడి హేమంత్ కుమార్, తిరుమాని సత్యనారాయణ, మరికొందరు నాయకులు టీడీపీలో చేరగా వారికి ఆమె పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

దర్భరేవు మురుగు కాల్వను ఆధునికీకరించాలి

నరసాపురం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దర్భరేవు మురుగు కాల్వను ఆధునికీకరించాలని బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కాల్వ వద్ద ఆందోళన చేపట్టారు. డ్రెయినేజీని ఆధునికీకరించకపోవడం వల్ల చాలావరకు పూడికపోయిందన్నారు. మురుగు లాగకపోవడం వల్ల వందలాది ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయన్నారు. సార్వా దాళ్వా పంటలను రైతులు నష్టపోతున్నారన్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీని ఆధునికీకరిస్తే సాగుకు వీలుంటుందన్నారు. జి.రామ్మోహన్‌రావు, వడ్డికాసులు, వెంకటేశ్వర్లు, నాగరాజు, సత్యనారాయణ, వంశీ, చంద్రశేఖర్, పండు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

15న '2కే రన్, సేవ్ ద గర్ల్ చైల్డ్' విజయవంతం చేయాలి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ఆడపిల్ల తల్లికి సాయం.. తండ్రికి స్నేహితురాలు, సోదరులకు ఆసరాగా నిలిచి ఉంటుంది కాబట్టి ఆడపిల్లను కాపాడుదాం' అంటూ రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ ఉదయం పాలకొల్లులో జరిగే మహోన్నతమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సంఘం నాయకురాలు నిట్టల శివశైలజ పిలుపు నిచ్చారు. స్థానిక కోడిగట్టున ఉన్న సరస్వతి శిశుమందిరం పాఠశాలలో బుధవారం ఉదయం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

• చిన్నవర్తకుల సంఘం మద్దతు : 2కే రన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో తమ వంతు పాత్ర పోషిస్తామని చిన్న వర్తకుల సంఘం అధ్యక్షుడు యింటి శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు బుధవారం సంఘ సమావేశం నిర్వహించి తీర్మానం చేసినట్టు తెలిపారు.

పేద కుటుంబానికి 'ఫోక్స్ సంస్థ' ఆర్థికసాయం

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్అండ్‌టీ నిర్మించిన టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న వృద్ధుడు కె.గనేశ్వరరావు ఆర్థిక పరిస్థితి బాగోలేదన్న విషయం తెలుసుకుని ఫేస్ బుక్ ఫ్రెండ్స్ (ఫోక్స్ సంస్థ) సభ్యులు బుధవారం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సొమ్ముతో కుటుంబ అవసరాలు, కుమార్తె చదువుకు ఉపయోగించుకుంటానని, సంస్థ సభ్యులకు గనేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ సభ్యులు వింజరపు కిషోర్‌కుమార్‌రాజ్, కేవీఎస్ఎల్ నరసింహరాజు, టి.చరణ్, యాక్సిస్ జగదీష్, కిషోర్, బి.భానుప్రకాష్ తదితరులు ఉన్నారు.



వృద్ధుడికి రూ.50 వేలు అందిస్తున్న ఫోక్స్ సభ్యులు

ప్లాస్టిక్ వాడకం అనర్థం

భీమవరంటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం అనర్థం అర్థరహితమని, ప్రాణాంతకమని తెలిసి విపరీతంగా ప్లాస్టిక్‌ను వినియోగించడం అవివేకమని భీమవరం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్‌లోని సంతలో తనిఖీలు, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవగాహన ఉండి కూడా ప్లాస్టిక్‌ను వాడకం నిర్లక్ష్యమని, గుడ్డ సంచులను వాడాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం మనందరి బాధ్యత అన్నారు. మానవతా ప్రసాద్ సౌజన్యంతో గుడ్డ సంచులను అందించారు. అనంతరం సంత మార్కెట్ నుంచి మారుతీ టాకీస్ సెంటర్ , కొత్త బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, అల్లు శ్రీనివాస్, మెప్మా కార్యకర్తలు వార్డు సెక్రటరీ పాల్గొన్నారు.



ర్యాలీలో కమిషనర్ రామచంద్రారెడ్డి

500 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పాలకోడేరు, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి) : గ్లోబల్ ఫౌండేషన్ యుఎస్ఏ వారు పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 500 మందికి కంటి పరీక్షలు చేసి మందులు అందజేశామని ఫౌండేషన్ సభ్యులు మంచిన యోగేంద్రకుమార్ అన్నారు. పాలకోడేరులోని కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ వద్ద పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వేమగిరి రాజమండ్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, క్షత్రియ సేవా సమితి సభ్యులు జి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

భీమవరం క్రైం, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి) : టైల్స్ పని నిమిత్తం రాజస్థాన్ రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తి కనిపించడం లేదంటూ చిన అమిరం గ్రామానికి చెందిన చేకూరి మోహన మురళీకృష్ణంరాజు టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మురళీ కృష్ణంరాజు ఇంటికి టైల్స్ పని నిమిత్తం రేవంత్ రామ్, బార్బల్ రామ్ అనే ఇద్దరూ కొంత కాలం క్రితం వచ్చారు. గత నెల 26 నుంచి బార్బల్ రామ్ కనిపించలేదు. అప్పటి నుంచి ఆచూకీ లేకపోవడంతో ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

చిరుజల్లులు

అన్నదాతల్లో ఆందోళన.. హడావుడిగా వరి మాసూళ్లు

అల్పపీడనం ప్రభావంతో బుధవారం వేకువజామున జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రోజంతా మబ్బులతో కూడిన వాతావరణం ఉండడంతో వరి పంటను దక్కించుకోవడానికి రైతులు హడావుడిగా మాసూళ్లు చేశారు. ఇప్పటికే మాసూళ్లు పూర్తయిన రైతులు తమ ధాన్యాన్ని తూకాలు వేసి మిల్లులకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు. మరో పది రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటే సార్వా నుంచి పూర్తిస్థాయిలో గట్టెక్కుతామని పలువురు రైతులు చెబుతున్నారు.



ఆచంటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవో.. గోటేరులో రైతుల హడావుడి

ఆచంట/యలమంచిలి/ఇరగవరం/ పెనుగొండ/నరసాపురం రూరల్/పాలకోడేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచంట, యలమంచిలి మండలాల్లో బుధవారం చిరుజల్లులు పడడంతో రోడ్లపై ఉంచిన ధాన్యానికి రైతులు బరకాలు కప్పారు. ఆరుగాలం కష్టించి పండించిన వరిపంటను దక్కించుకునేందుకు అన్నదాతలు ఉరుకులు, పరుగులు తీశారు. పెనుగొండ మండలంలో 11,750 ఎకరాల్లో సార్వా నాట్లు వేయగా ఇప్పటి వరకు 9 వేల ఎకరాల్లో మాసూళ్ళు జరిగాయని 61 శాతం మాసూళ్లు పూర్తయ్యాయని ఏవో పి. స్పందన తెలిపారు. నరసాపురం మండలంలో సార్వా కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మల్లవరంలంక, మల్లవరం, కొప్పర్రు, సీతారాంపురం, రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. కొంతమంది రైతులు దాళ్వా నారుమడులు పోసుకుంటున్నారు. ఈనెలాఖరుకు నూరుశాతం నారుమడులు పూర్తవుతుందని ఏడీఈ అనిల్‌కుమారి తెలిపారు. పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, విస్సాకోడేరు, గొల్లలకోడేరు తదితర గ్రామాల్లో రైతులు సార్వా పంటను రక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

అధికారుల పరిశీలన, సూచనలు

ఆచంట మండల తహసీల్దార్ జి.కనకరాజు, ఏవో బి.నాగరాజు బుధవారం ఆచంట, కొడమంచిలి, వల్లూరులో రోడ్లపై ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. సార్వా ధాన్యం కొనుగోలు నిమిత్తం గోనె సంచులు , రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. అత్తిలి మండల తహసీల్దార్ దశిక వంశీ మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైసు మిల్లులకు తరలించాలన్నారు. ఈడూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. తుపాను హెచ్చరికలు నేపథ్యంలో రైతులు కళ్లాల్లోని ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా నచ్చిన మిల్లుకు తరలించి తేమశాతం లేకుండా చూసుకోవాలని కోరారు. ధాన్యాన్ని తరలించటానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. తణుకు మండలంలోని దువ్వ, తేతలి గ్రామాల్లో తణుకు ఏవో కుసుమ బుధవారం పర్యటించారు. తణుకు మండలంలో ఇప్పటివరకు 18,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 8 ఆర్ఎస్‌కెల ద్వారా కొనుగోలు చేశామని, 1700 మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లో ఉందని దానికి సరిపడా సంచులు ఆర్ఎస్‌కెల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 3627 మంది రైతులకు 4.8 గంటల్లో రూ.38.07 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. మండలంలో 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన మిల్లులకు తరలిస్తామన్నారు. పలు చోట్ల ఎంటీయు 1318 రకం మాత్రం పంట కోతలు జరగాల్సి ఉంద న్నారు. మండలంలో ఎంటీయూ- 1121, ఎంఆర్ 126 రకాలు నారుమళ్ళు వేసి పది రోజులు పూర్తయిందన్నారు.



జేసీని కలిసిన టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరంటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలలో నూతనంగా ఎంపికైన ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి భీమవరం కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపిమూర్తి ఉపాధ్యాయులకు సంబంధించి పలు విషయాలను జేసీకి వివరించారు.

15న గూడెం నుంచి సప్త శ్రీనివాస దర్శనం

ఉంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి ఆదివారం పురస్కరించుకుని ఈ నెల 15న సప్త శ్రీనివాస దర్శనం పేరుతో యాత్ర బస్సును ఏర్పాటు చేశామని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. శ్రీనివాస దర్శనం (అన్నవరప్పాడు, వాడపల్లి, కొడమంచిలి, అబ్బిరాజుపాలెం, అప్పన్నపల్లి, ద్వారకాతిరుమల, పారిజాతగిరి) లలో వేంకటేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చని వివరంచారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు జమల్ షరీఫ్ ఇటీవల మృతి చెందడంతో బుధవారం బాబ్జి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఎరుబండి సతీష్, ముప్పిడి రమేష్, దూసనపూడి కృష్ణ ప్రసాద్, దాట్ల జగన్నాధరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ ఎన్నిక

పాలకొల్లు , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగింది. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా అడ్డాల నరేష్, కార్యదర్శిగా బుడ్డిగ గోపిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఏపీయూడబ్ల్యూజేకు, పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌కు తమ సంఘం అనుబంధంగా ఉంటుందని వెల్లడించారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పోకల రాము, వానపల్లి భాను ప్రసాద్, కూనపరెడ్డి శ్రీనివాస్, మద్దా విజయలాజరస్, బండి శ్రీనివాస్, దోసా శాంతారామ్, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ స్కూల్లో వ్యవస్థాపకుల వంశస్థుల సందర్శన

ఇరగవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్థలదాత, మొదటి హెచ్ఎం, వ్యవస్థాపకులు వీఎన్ కృష్ణారావు వంశస్థులు విదేశాల నుంచి వచ్చి బుధవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో హెచ్ఎం కె.పద్మావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణారావు వంశస్థులు దినకరరావు, మురళీకృష్ణరావు, రాధా మురళీ ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఇంతటి ప్రతిష్ఠత కలిగిన పాఠశాలను స్థాపించడంలో మా పూర్వీకులు ఉండడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో 12 మంది బంగారు, 24 జూరీ అవార్డులు పొందిన పాఠశాల విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు బహూకరించారు. బెస్ట్ అవుట్ గోయింగ్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే రూ.40 వేలు చెక్కును అందజేసి ఆగస్టు 15న ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు కృష్ణారావు వంశీకులను శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యాకమిటీ ఛైర్మన్ ఎం.వెంకటలక్ష్మి, టి.మారుతీరావు, వై సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఉండి కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కృష్ణచైతన్య ఆశ్రమ భక్తులు

వైభవంగా గీతా జయంతి పూజలు

ఆచంట/పెనుగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో గీతా జయంతి పూజా కార్యక్రమాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆచంట మండలం కరుగోరుమిల్లిలో వున్న లక్ష్మీగణపతి అభయాంజనేయస్వామి బాలా త్రిపుర సమేత రామేశ్వర స్వామి వారి ఆలయం వద్ద గీతాజయంతి ఏకాహ మహోత్సవ పూజా కార్యక్రమాలుజరిగాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. పెనుగొండ మండలం వడలి గ్రామంలో గీతా జయంతి సందర్భంగా వడలి గ్రామ దేవత మండాలమ్మ ఆలయ ప్రాంగణంలో విజయవాడ విద్యాసాగర్ స్వామిజీ గీతాహోమం జరిపించారు.

• నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణంలోని రాజగోపాలస్వామి ఆలయంలో గీతాపారాయణ చేశారు. కృష్ణవేణి, వీవీ భారతి, ఉషారాణి, మంగతాయారు, ఆరుణ, దీప్తి, కనకదేవి, నాగలక్ష్మి, శ్రీనివాస్, శ్రీనివాసవర్మ పాల్గొన్నారు. మొగల్తూరులోని భజన మండలి ఆధ్వర్యంలో స్థానిక రాజగోపాలస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ మహిళలు భగద్గీత పారాయణం చేశారు. అనంతపల్లి రాజేశ్వరీ, సుహాసిని, సుందరి, కారుమూరి రాజ్యలక్ష్మి, ఆకన రాము తదితరులు ఉన్నారు.

• తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగధ్యాన మందిరంలో ఆలయ కార్యదర్శి ఇందుకూరి మోహనరాజు పర్యవేక్షణలో స్వామికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు.

• పాలకొల్లు అర్బన్ : స్థానిక గజలక్ష్మి థియేటర్ ఎదుట వీధిలో వున్న గీతా మంది రంలో జిన్నూరు ఐడియల్ స్కూల్ విద్యార్థులు గీతా శ్లోకాలను పఠించారు. ఉల్లంపర్రుకు చెందిన ఏగులమ్మ భజన బృందం ఆధ్వర్యంలో భజనలు, మధ్యాహ్నం భీమవరానికి చెందిన కొంపల్లి రామమూర్తిరాజు శ్రీమద్భగవద్గీత ద్వాదశ అధ్యాయం-భక్తియోగంపై ప్రవచనం గావించారు.

• ఉండి, : ఉండి గ్రామంలో భక్తులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఉండి కొత్తపేట కృష్ణచైతన్య ఆశ్రమంలో తొలుత భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేసిన ర్యాలీ నిర్వహించారు. కృష్ణచైతన్య ఆశ్రమం ఇన్‌చార్జి కృష్ణదాస్ బ్రహ్మచారి, విశ్వహిందూపరిషత్‌కు చెందిన సునీతాదేవి, కామేశ్వరమ్మ తదితరులు హాజరయ్యారు. ఉండి శివాలయంలో గీతా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

మావుళ్లమ్మకు మాజీ మేయర్ దంపతుల పూజలు

భీమవరంటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మావుళ్ళమ్మను రాజమహేంద్రవరం మాజీ నగర మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీస్సులు అందించగా, ఆలయ ఈవో నగేష్ సత్కరించి ప్రసాదాలు అందించారు. అనంతరం యనమదుర్రులో ఉన్న శక్తీశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ వేమిరెడ్డి హరికృష్ణ, అల్లు శ్రీనివాస్, సీహెచ్ రాంబాబు పాల్గొన్నారు.



మావుళ్ళమ్మ ఆశీస్సులు అందుకుంటున్న మాజీ మేయర్ దంపతులు

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు : ఎంపీపీ

ఆచంట, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : సార్వా మాసూళ్ళు జరుగుతున్న దృష్ట్యా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నాణ్యమైన గోనె సంచులు అందించాలని ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి సూచించారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ బొక్కా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండిస్తున్న రైతులను ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా రైతులకు మేలు చేసే విధంగా చూడాలన్నారు. ధాన్యం అమ్మే విషయంలో దళారులు రైతులను మోసం చేయకుండా చూడాలని కోరారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్న కారణంగా ఎటువంటి అభివృద్ధి పనులపై చర్చించకుండా సమావేశాన్ని ముగించారు. వైస్ ఎంపీపీలు తాళం శ్రీనివాస్, యర్రగొప్పుల నాగరాజు, ఎంపీడీవో వి.పూర్ణ బాబ్జీ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆచంట మండల పరిషత్ సమావేశ దృశ్యం

ఆధ్యాత్మికం

హనుమద్ వ్రత ఉత్సవాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెం బరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూ డెం హౌసింగ్ బోర్డులో వున్న దక్షిణ ముఖ సువర్చల సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమద్ వ్రత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామికి జనసేన యువనాయకులు బొలిశెట్టి రాజేష్ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో పల్లకి ఉత్సవం నిర్వహించారు. మోదుగగుంటలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో షష్ఠి తిరనాళ్ల సందర్భంగా బుధవారం సర్పంచ్ కట్టా జానకీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు.

• యలమంచిలి : స్థానిక ఉమాసోమేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులు గణపతి హోమం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు గ్రామవీధుల్లో రంగులు చల్లుకుంటూ, పేట తుళ్లి నృత్యాలు చేస్తూ అయ్యప్ప గీతాలు ఆలపించారు. గురుస్వాములు నరేంద్రశర్మ, సత్యనారాయణ, మల్లన్న, స్వాములు గోపాలకృష్ణ, గౌతమ్, శివ తదితరులు పాల్గొన్నారు.



పాలంగి శివాలయంలో డాక్టర్ కృష్ణ దంపతుల పూజలు

• తణుకు : తణుకు సమీపంలోని పాలంగి గ్రామంలో వున్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ధ్వజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు డాక్టర్ చాపరాల కృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• ఉండి : శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం షష్ఠి ఉత్సవ కమిటీ, క్షత్రియ యూత్ సభ్యులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్ గొట్టుము క్కల కళ్యాణ్‌వర్మ, టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు మంతెన సాయిలచ్చిరాజు, ముదునూరి కృష్ణంరాజు, ముదునూరి బలరామరాజు, కూనపరాజు కృష్ణంరాజు, ఉద్దరాజు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇటుకులగుంట చెరువు రజకులకు అప్పగించాలి

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రజక వృత్తిదారులకు కేటాయించిన ఇటుకులగుంట చెరువు వృత్తిదారులకు అప్పగించాలని సంఘ జిల్లా కార్యదర్శి మడకరాజు డిమాండ్ చేశారు. మెట్టఉప్పరగూడెంలోని ఇటుకుల గుంటలో సోమన్న చెరువును బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వృత్తిదారులకు కేటాయించిన చెరువు త్వరగా అప్పగించాలన్నారు. జిల్లా కార్యవర్గసభ్యులు యండమూరి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

14న నీటి సంఘాల ఎన్నికలు

ఆకివీడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14న జరుగుతాయని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన పీవో, ఏపీవోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో పెదకాపవరం, కోళ్ళపర్రు, సిద్ధాపురం, ఆకివీడు, కుప్పనపూడి, అయి-భీమవరం గ్రామాల్లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులకు సంబంధించి ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతాయన్నా రు. వీటికి సంబంధించి ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయాధికారి, ఇరిగేషన్ ఏఈ, వెటర్నరీ వైద్యులు విధులు నిర్వహిస్తారన్నారు. వ్యవసాయాధికారి ప్రియాంక, ఎంఈవో రవీంద్ర, డీటీ ఫరూఖ్, ఆర్ఐ వి.ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

దుకాణాల్లో ధరల పట్టికలు ఉండాలి

ఆకివీడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాంసం, కూరగాయల దుకాణాల వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.సాకేత్ అన్నారు. బుధవారం ఆయన మాంసం, కూరగాయల దుకాణాలు పరిశీలించి మాట్లాడారు. మాంసం వర్తకులు జీవాలను కబేళాలో కోసిన తరువాత నగర పంచాయతీ సీల్ వేయించుకున్న తరువాతే విక్రయాలు చేయాలన్నారు. వీటిలో ఏది జరగకపోయినా చర్యలకు బాధ్యతలవుతారని హెచ్చరించారు. శానిటరీ మేస్త్రీలు ఉన్నారు.

వృద్ధులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు పట్టణంలోని రాహుల్ సేవా సంస్థ వృద్ధాశ్రమంలోనూ, విశ్వమానవ సేవ వృద్ధుల ఆశ్రమంలోనూ వృద్ధులకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు అందించి, మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమాల నిర్వాహకులు జోగాడ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పదో వార్డు బీజేపీ అధ్యక్షురాలిగా లక్ష్మీఅశ్విని

భీమవరంటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పదో వార్డులోని 92వ బూత్‌లో అధ్యక్షురాలిగా రౌతు లక్ష్మీఅశ్విని బూత్‌లోని బీజేపీ సభ్యులు బుధవారం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారిగా కూరేళ్ల నరసింహారావు, అసెంబ్లీ కన్వీనర్ కాయిత సురేంద్ర, జిల్లా కార్యదర్శి కిలంపూడి రమాదేవి, పట్టణ ప్రధాన కార్యదర్శి వబిలిశెట్టి ప్రసాదరావు, పచ్చిగొల్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలవపేటలో క్రిస్మస్ వేడుకలు

నరసాపురం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చలవపేటలో బుధవారం బీటీసీ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకను నిర్వహించారు. క్రిస్మస్ ఆరాధనను బెజవాడ ఆసాఫు, పాస్టర్ షారోన్ కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చిన్నారులు, యూత్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు వీడ్కోలు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మండలంలో పదేళ్లపాటు కార్యదర్శులుగా, సిబ్బందిగా పని చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిని సాదరంగా వీడ్కోలు తెలపడం అభినందనీయమని జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు పేర్కొ న్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మండలంలో కార్యదర్శులుగా పనిచేసి వేరే మండలం వెళ్లిన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, అప్పారావు, రమేష్, శేఖర్‌లతోపాటు జూనియర్ అసిస్టెంట్ భరత్‌లను తోటి కార్యదర్శులు సత్కరించారు. ఎంపీడీవో ఎం.విశ్వనాదశర్మ, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, కార్యదర్శులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.